కథ 1996

7

ఉత్తుత్తి మనుష్యులు

ఓ.ఆర్. ఇంద్ర

సాయంసంధ్య వేళ చాలీచాలని తక్కువ రకం సిల్కుచీరతో వంపుసొంపులు కొట్టవచ్చినట్టు కనిపించేలా అర్ధనగ్నంగా సింగారించి, ముఖానికి దట్టంగా పౌడరద్ది, ఘాటైన చవకరకం సెంటు పూసుకుని, తెచ్చిపెట్టుకున్న తళుకు బెళుకులు ఎరపెట్టి విటుల కోసం ఎదురుచూస్తున్న వేశ్యలా వుంది బజారు.

కొనలేని వాడి దారిద్ర్యాన్ని వెక్కిరిస్తున్నట్టు అద్దాల షోకేసుల్లో మిలమిలా మెరుస్తూన్న ఖరీదైన వస్తువుల వంక చూస్తూ నడుస్తున్న భరద్వాజ ఆ షాపుకి ఎదురుగా కొంచెం దూరంగా ఆగాడు. అపుడే వేసిన మెర్క్యురీ లైట్ల కాంతిలో, మెట్లమీద నుంచి షాపు లోపలి వరకు పరచిన ఎర్ర తివాచీతో రాజదర్బార్‌లా వుంది ఆ మహావీర్ షూస్ షాపు.

భరద్వాజ ఆ షాపులోకి ఎప్పుడూ అడుగుపెట్ట లేదు- అలా కొంచెం దూరం నుంచి చూడడం తప్ప. ఆ సమయంలో ఆ షాపులో సేల్స్‌మేన్ శాస్త్రి- తన కొడుకు వెంకటనాగసుబ్రహ్మణ్యశాస్త్రి చాలా బిజీగా వుంటూ కన్పిస్తాడు. కస్టమర్స్‌కి కావలసిన చెప్పులు, బూట్లు, హైహీల్స్, రాక్స్‌లోంచి తీసి, వాళ్ల కాళ్లకి తొడగడం, అవి వదులైనా లేక బిగుతైనా మార్చడం, వాటి క్వాలిటీ గురించి నచ్చచెప్పి వాటిని కొనిపించడం సేల్స్‌మేన్‌గా శాస్త్రి డ్యూటీ. ఆ డ్యూటీ నిర్వహణలో తన కొడుకు ఎవరెవరి కాళ్లో పట్టుకుని పాదరక్షలు తొడగటం చూస్తుంటే భరద్వాజకు బాల్యస్మృతులేవో గుర్తుకొస్తాయి.

తనకి పన్నెండేళ్లపుడు వోసారి ఇపుడు తన కొడుకు చేస్తున్న పనే- మరొకరి కాళ్లు పట్టుకుని జోడు తొడిగినందుకు ఆ రోజు పలుపు తాడుతో తన వీపు తట్లు తేలింది. ఇపుడాపని తన కొడుకు జీవనాధారం! ఈమధ్య సాయంకాలాలు అపుడపుడు బజారొచ్చి ఆ షాపు ముందాగి కాసేపలా చూడటం తనకో అలవాటైంది. ఆ షాపుతో ప్రత్యక్షంగా తనకేమీ సంబంధం లేకపోయినా అజ్ఞాతంగా తన జీవితంలో ఏదో లింకు ఉందనిపిస్తుంది.

ఆ మహావీర్ షాపు ప్రొప్రయిటర్ వీరయ్య- ఒకప్పుడు వీరిగాడు- ఆ ఊరి సంతపేటలోని చింత చెట్టు క్రింద తండ్రితో కూర్చుని చెప్పులు కుట్టుకునే మాదిగ వీరిగాడు తన ఈడువాడే. మాలమాదిగలు సవర్ణుల పిల్లల బడిలో ప్రవేశించడం నిషేధం కాబట్టి వీరిగాడు చదువుకి నోచుకోలేదు. కోనసీమ ముఖద్వారం దగ్గరనున్న ఆ పెద్ద పల్లెటూళ్లోని ఆ ఊరి జనాలకి వీరిగాడు, వాడి బాబు చేసిచ్చే చెప్పులే గతి. కోరిన పద్ధతుల్లో కొత్త చెప్పులు తయారుచేయడం, పాతవి క్షణాల్లో రిపేరు చేసివ్వడంలో వీరిగాడు త్వరలోనే తండ్రిని మించి పోయాడు.

తన తాత సోమయాజులు వోసారి తన తెగిపోయిన చెప్పులు కుట్టించుకురమ్మని తనకి పురమాయించాడు. అపుడు వీరిగాడొకడే ఆ చెట్టు క్రింద పని చేసుకుంటున్నాడు. వాడు తెగిపోయిన తన తాతగారి చెప్పుల్ని ఒకసారి పరీక్షించి, పాడైపోయిన తోలు ముక్కని పదునైన పరికరంతో కోసిపారేసి, కొత్త తోలుముక్కని అతికి ఆరుతో చకచకా ఏకాగ్రతతో కుడుతూంటే తను ఆ పరికరాల వంక, లాఘవంగా కదులుతున్న వాడి వేళ్లవంక చూస్తున్నాడు. తనకీ ఆ పరికరాలు ఉపయోగించి రెండో చెప్పుని రిపేరు చెయ్యాలనిపించింది. వీరిగాడ్ని అడిగితే, వాడు నవ్వి-

"నీకు చాతకాదు పంతులూ, అది చాలా పదును, నీ చెయ్యో, వేలో ఎగిరిపోతుంది జాగ్రత్త!" అన్నాడు. తనకన్న ఏదో పెద్ద అయినట్టు. అలా అనేసరికి తనకి పౌరుషం వచ్చి, "ఈ మాత్రం ఎందుకు చాతకాదూ! చూడు, నేనూ కుడతాను..." అంటూ రెండో చెప్పు కుట్ట బోయి ఆరుతో వేలు గుచ్చుకున్నాడు. అయినా ఎలాగో కుట్టి, "చూడు," అంటూ వాడి కాలికి తొడిగాడు. వాడు ఎగతాళిగా నవ్వి తను వేసిన కుట్టు విప్పేసి, మళ్లా కుడుతూ-

"చెప్పులు కుట్టడం అంటే మంత్రాలు సదవడం కాదు పంతులూ!" అన్నాడు. ఆ మాటకి తనకి కోపం వచ్చినా, వీరిగాడిలా తను కుట్టలేడనీ, అది నేర్పుతోనూ, అభ్యాసంతోనూ కూడిన పని అని అర్థమై, మాట్లాడ కుండా, పీలికలై దుమ్ముకొట్టి వున్న వాడి చొక్కావంకా, తైల సంస్కారం లేని వాడి దుబ్బుగడ్డిలాటి జుట్టు వంక, వాడి ఆకారంతో సంబంధంలేని, ఆత్మవిశ్వాసాన్ని ప్రతి ఫలిస్తున్న వాడి ముఖం వంక చూస్తూ నిలబడ్డాడు. అలా, అతని కాలికి తాను జోడు ఎక్కిస్తోంటేనే, తన ఖర్మకాలి, తన తాతగారి దగ్గర పౌరోహిత్యం నేర్చు కుంటున్న సాంబడు అటుగా సైకిల్‌పై వెడుతూ తనని చూసి, తను మాదిగ వీరిగాడితో అంటకాగి కూర్చుని చెప్పులు కుడుతున్నట్టు తాతకి పితూరీ చేరవేశాడు.

దాని ఫలితంగా చండశాసనుడైన తన తాత చేతిలో పలుపుతాడు తన వంటి మీద శివతాండవం చేసింది. అంటరానివాడ్ని, వాడి పరికరాలనీ ముట్టుకు న్నందుకు ప్రాయశ్చితంగా కాలిన దర్భతో నాలిక మీద వాత పెట్టించుకోవడం, పది బక్కెట్లతో శిరఃస్నానం చేయాల్సి రావడమేకాక, మరెపుడూ అటువంటి అప్రాచ్యపు పనులు చేయనంటూ గుంజీలు తీయాల్సి వచ్చింది.

"వాళ్లు చచ్చిన జంతువుల్ని ఊరి చివరికి ఈడ్చు కెళ్లి, తోలు వలిచి చెప్పులు తయారుచేస్తారు. అది వాళ్ల వృత్తి. ఆ పని మనం చెయ్యకూడదు. చచ్చిన జంతువుల్ని వాళ్లు ముట్టుకుంటారు కాబట్టి వాళ్లని మనం తాక కూడదు," వీపుమీద తట్లుకి కొబ్బరినూనె రాస్తూ చెప్పింది తల్లి.

"వాళ్లని ముట్టుకోవడమే మైల అయితే, వాళ్లు తయారుచేసిన చెప్పులు తొడుక్కోవడం మైల కాదామ్మా."

తల్లి మాట్లాడలేదు.

"జోళ్లు అందరికీ అవసరమే. మంత్రాలు ఎందుకు అవసరం."

"తాతయ్యనడుగు," చెప్పింది తల్లి.

పలుపుతాడు కళ్ల ముందు నాట్యమాడి మౌనం వహించాడు.

తాత పౌరోహిత్యమే తమ కుటుంబానికాధారం. కొన్నాళ్ల క్రితం తండ్రి హఠాత్తుగా పోతే, తాత, మేన మామల ఇంటికి చేరాల్సి వచ్చింది గత్యంతరం లేక. తను సెకండుఫారం చదువుతూండగా, చదువు మాన్పించి పౌరోహిత్యంలోకి దింపాలని చూశాడు మేన మామ. కానీ తాత, మేనమామల్లా పంచెకట్టి, కాలవ గట్టుకెళ్లి తద్దినాలు పెట్టించడం, అర్ధరాత్రిళ్లు లేచి పెళ్లిళ్లు చేయించడానికి వెళ్లడం, బియ్యం, కొబ్బరి చిప్పలు, మాగిన అరటిపళ్లు, చిల్లర డబ్బు పోగేసుకు రావడం తనకెందుకో వెగటనిపించేది. నీట్‌గా క్రాఫ్ చేయించుకుని, పేంటు, షర్టు తొడిగి తన ఇంగ్లీషు మాష్టారిలా అవ్వాలని ఉబలాటపడేవాడు.

ఒకసారి సంతపేటలో చిన్న సర్కస్ కంపెనీ వాళ్లు గుడారం వేసి ప్రదర్శనలు ఇస్తోంటే తనూ స్నేహితు లతో కల్సి స్కూల్ ఎగ్గొట్టి, తాతగారి బనీన్ జేబులోంచి బేడ దొంగలించి సర్కస్‌కి వెళ్లాడు. బేడపెట్టి తను బెంచి టిక్కెట్ కొంటే, అణాపెట్టి నేల టికెట్ కొన్న స్నేహితు డొకడు తననుద్దేశించి మిగతా వాళ్లతో-

"వీడికేంరా, మనలా కూలికెళ్లి కష్టపడి సంపాదిం చాలా ఏమన్నా? నాలుగు సంభావనలకెళ్లి చేతులు చాస్తే నాలుగణాలు రాల్తాయి," అన్నాడు ఎగతాళిగా.

అది తనకి గుండెల్లో గునపంలా తాకింది. ఇంక ఛస్తే సంభావనకెళ్లకూడదనుకున్నాడు. తనూ కష్టపడి సంపాదించగలడని రుజువు చెయ్యడానికి, తన పాకెట్ మనీకోసం బ్రిడ్జి కడుతున్న చోటికి కూలిపని చెయ్య టానికి- మట్టితట్టలు మొయ్యటానికి కూలి పనులకెళ్లే స్నేహితులతో కలిసి వెళ్లాడు. ఆడకూలీలకి, పిల్లకూలీలకి రోజుకి రూపాయి కూలి. ఎన్ని సంభావనల కెళ్లి సిగ్గు చంపుకుని అసహ్యంగా చేతులు చాస్తే రూపాయి సంపా దించగలడు? చీమలబారులా, క్రమశిక్షణగల సైనికుల్లా ఎండలో చమటలు కార్చుతూ మట్టి తట్టలు మోస్తున్న ఆడవాళ్లనీ, పిల్లలనీ చూశాడు. ఎన్నడూ మట్టి ముట్టు కోని తను బరువైన ఆ మట్టితట్టలు మొయ్యగలడా అని అనుమానమొచ్చింది. కానీ తన అనుమానం తీరే అవ కాశమే రాలేదు. తను సోమయాజులుగారి మనవడని తెలిశాక వాళ్లే పనివ్వలేదు. తను కూలిపని చెయ్యడానికి వెళ్లాడన్న వార్త మాత్రం ఎలాగో తాత చెవిని పడనే పడింది. మళ్లీ పలుపుతాడు తన వంటిని ముద్దాడింది.

తాత నియంతృత్వానికి కినిసి ఇల్లొదిలి పారి పోయేడు. కానీ రెండోరోజునే మేనమామ వెదికి తనని ఇంటికి లాక్కెళ్లాడు. తల్లి తనను పట్టుకుని వెక్కివెక్కి ఏడ్చింది. తాత మాటకి ఎదురుచెప్పనని ఒట్టేయించింది. తల్లి బాధ తను దెబ్బలు తిన్నందుకో లేక తక్కువ కులాల వాళ్లతో కలిసి కూలిపనికి వెళ్లినందుకో తనకి అర్థంకాలేదు. అర్థమయిందల్లా ఒకటే- తను ఇతరుల్లా శారీరక శ్రమచేసి సంపాదించడం నిషిద్ధం. శ్రమించ కుండా సంభావనల కెళ్లి చేతులు చాచడం తనకి వెగటు. అది తన దృష్టిలో యాచకత్వం. శారీరక శ్రమ ఎలా పరువు తక్కువైందో తన సందేహం తీర్చేవాళ్లులేరు. ఆరోజుతోనే తన ఏడో తరగతి చదువు అటకెక్కి, తాత గారి బియ్యం, కొబ్బరి చిప్పల సంచీ తన చంకెక్కింది. తాత తన చేత బలవంతాన వల్లె వేయించే ఆ మంత్రా లకి అర్థం ఏమిటో, అసలు వాటికేమైనా అర్థం వుందో లేదో, తన తాతకైనా వాటి అర్థాలు తెలుసోలేదో తనకి తెలియదు. తాతని అడగటానికి భయం, అయిష్టత, జుగుప్స. పెళ్లిమంత్రాలు, గర్భదాన మంత్రాలు, తద్దినం మంత్రాలు, బారసాల మంత్రాలు, గృహప్రవేశ మంత్రాలు, దేవుళ్ల వ్రతమంత్రాలు- ఒకటేమిటి- ప్రపం చంలో ఎన్ని మంత్రాలున్నాయో వాటినన్నిటినీ బట్టీ పట్టడంతోనే తన బాల్యం, కౌమారం గడిచిపోయాయి.

తనకి ప్రతి విషయాన్నీ ప్రశ్నించి, తర్కించి, పూర్వా పరాలతో కూలంకషంగా తెలుసుకోవాలని వుండేది. తన బుర్రనిండా ఎన్నెన్నో సందేహాలు, తీర్చేవాళ్లే కరువు. చచ్చిన వ్యక్తి పేరిట అతగాడి కొడుకు గోదానం చెయ్యక పోతే, ఆ చచ్చిన తండ్రి వైతరిణి అనే చీమూ, నెత్తురుతో ప్రవహించే నదిలో పడిపోతాడని, గోదానంపట్టే తన తాత చచ్చిన వాళ్ల బంధువులతో అనడం ఎన్నోసార్లు తను విన్నాడు. ఆ వైతరణిని చూసివచ్చిన వాళ్లెవరు అని అడగాలని వుంటుంది. తన తాతలాటివాళ్లకి గోదానం, భూదానం, సువర్ణదానం, వస్త్రదానాలు చేస్తే వాళ్లెన్ని పాపాలు చేసినా అవి కేన్సిలైపోయి స్వర్గానికెడతారా? అటువంటి సందేహాలు తన వృత్తిలో వున్నవాళ్లకి రాకూడ దేమో. జిజ్ఞాస తన వృత్తికి శత్రువు కాబోలు అనుకునే వాడు.

అలాగే ప్రతి వస్తువూ ఎలా తయారవుతుందో తెలుసుకోవాలని, చూడాలనీ, ఆ పని నేర్చుకోవాలని తనకి తగని కుతూహలం వుండేది. వడ్రంగుల చేతిలో కలప కుర్చీలు, మేజాబల్లలు, టీపాయ్‌లు వంటి సుందరమైన కళాకృతులు తయారవడం చూస్తూంటే తనకీ వడ్రంగం నేర్చుకోవాలనిపించేది. ఒకసారి వడ్రంగు లెవరూ చూడకుండా చిన్న రంపం తీసుకుని చిన్న చెక్క ముక్కని కాళ్లమధ్య బిగించి కొయ్యబోయి, బొటనవేలు కోసుకున్నాడు. అప్పుడు కానీ ఎంత చిన్న పనికైనా ఎంత నైపుణ్యం, అలవాటు, కండరశక్తి కావాలో అర్థం కాలేదు.

కమ్మరి కొలుము దగ్గర కణకణాలాడే బొగ్గుల్లో ఎర్రగా కాల్చిన ఇనుముని పెద్ద సమ్మెటతో కొట్టి సాగ తీసి, గునపాలు, కొడవళ్లు, ఇతర పరికరాలుగా తయారు చేయడాన్ని ఆసక్తిగా చూడడం తనకెంతో ఇష్టం. ఆ పెద్ద సమ్మెటని తను కాదుకదా తన తాత కూడా ఎత్తలేడని పించింది. ఎర్రగా కాల్చిన ఇనుముని టెంపరెక్కించే టందుకు నీళ్లలో ముంచి 'చుయ్' మనిపించడం, పెద్ద ఇనుప రింగుని పిడకలు పేర్చి కాల్చి బళ్ల చక్రాలకి ఎక్కించడం, చూస్తుంటే బలేగా అనిపించేది. వేడెక్కిన ఇనుముని పెద్ద సమ్మెటతో సాగకొట్టే ఆ ముసలతని కండలు, చెయ్యెత్తినపుడల్లా బలే డాన్స్ చేసేవి. శారీరక శ్రమ మనిషికి కండ పుష్టినీ, సుందరాకారాన్నీ ఇస్తుంది కాబోలు. ఆ ముసలతను వయసుపైబడ్డ భీముడిలా వుండేవాడు. ఏ శారీరక శ్రమా లేక బానపొట్టలతో వుండే తన తాత, మేనమామ గుర్తొచ్చేవారు. ఆ గునపాలు, కొడవళ్లే లేకపోతే వ్యవసాయం చెయ్యడం, పంటలు పండించటం ఎంత కష్టం అనుకున్నపుడు ఎవరికైనా కమ్మరిని మించిన చుట్టం ఎవరుంటారనిపించేది.

కమ్మరి కొలుముకి ఎడమప్రక్క కొంచెం దూరం లో కుమ్మరి భూషయ్య తన కుమ్మరి సారె మీద కుండలు, అందమైన కూజాలు, డబ్బులు దాచుకు నేందుకు మట్టి పిడతలు తయారుచేసే చోట గంటల తరబడి నిలబడి వింతగా చూసేవాడు. కుమ్మరి చక్రం తిరుగుతూంటే, మెత్తని రేగడిమట్టి ముద్ద భూషయ్య చేతుల్లో విచిత్రమైన పోకడలు పోతూ, క్షణాల్లో సొగసైన ఆకారాలు సంతరించుకోడం చాలా అద్భుతం అనిపిం చేది. ఆ కుండల్నీ, కూజాలనీ చూస్తుంటే తనకి సోషల్ పాఠాల్లో చదువుకున్న సింధు నాగరికత, మొసపొ టేమియా నాగరికతలు గుర్తొచ్చేవి. కాలగర్భంలో కలిసి పోయిన ఆ మహా నాగరికత గురించి తెలుసుకోడానికి ఆధారాలు కుండ పెంకులే అన్న విషయం గుర్తొచ్చి నపుడు కుమ్మరి భూషయ్య గొప్ప నాగరికతా నిర్మాతగా కనిపించేవాడు. తనకి అలా అందమైన కుండలు, కూజాలు చెయ్యాలనిపించేది. ఒకసారి ఎలాగో బిడి యాన్ని చంపుకుని భూషయ్యతో, "కుండలు చెయ్యడం నాకు నేర్పుతావా?" అనడిగాడు. భూషయ్య పకాపకా నవ్వి-

"భలేవాడిని పంతులూ! కుండలు సెయ్యడ వంటే మంత్రాలు సదవడమనుకున్నావేంటి? అయినా బాపన బిడ్డవి, మాలా మట్టి పిసుక్కునే ఖర్మ నీకేటి? నాలుగు లొల్లు మంత్రాలు సదివితే జేబులు నిండు తయ్యి గద మీకు, యెల్లెల్లు," అన్నాడు చక్కటి ఆకారాన్ని సంతరించుకున్న కూజా అడుగుని రేకు ముక్కతో నీట్‌గా కట్ చేసి సారె మించి వేరుచేసి ప్రక్కన పెడుతూ. తను హతాశుడయ్యాడు. తను నోరు తెరిచి అడిగినందుకైనా తనచేత ఓ కూజా చేయించకూడదూ అనుకున్నాడు. చదువు లేకపోయినా భూషయ్యలాటి వాళ్ల దగ్గర, వడ్రంగి సూరయ్యలాటి వాళ్ల దగ్గర ఎంతటి సృజనాత్మకత, నైపుణ్యం వున్నాయి అని ఆశ్చర్య పోయాడు. తన తాత, మేనమామ లాటివాళ్లు, పండితులమనీ, విద్వాంసులమనీ చెప్పుకునేవాళ్లు ఆ నిరక్షరాస్యులైన శ్రమజీవులు తయారుచేసే ఏ ఒక్క వస్తువునీ కూడా తయారుచేయలేరని అర్థమైంది.

ఒకసారి రాజమండ్రిలో ఏటిగట్టున పెట్టిన ఎగ్జిబిషన్‌లో ఒరిస్సా కళాకారులు మట్టితో చేసి ప్రదర్శించిన అద్భుతమైన శిల్పాలు చూసి తన్మయుడైపోయాడు. వాటిని చూస్తుంటే తనని కదిలించేది, జీవితానికి ప్రేరణనిచ్చేది సౌందర్యం, సృజనాత్మకమైన కృషి అని అర్థమవ సాగింది. సృజనాత్మకమైన ఏ కళ అయినా, పనైనా మనిషిని ఎంత ఎత్తులకి తీసుకుపోతుందో, ఎంతటి అలౌకికమైన ఆనందాన్నిస్తుందో గ్రహించాడు. సౌందర్య సృష్టితో సంబంధంలేని జీవితం ఎంత నిస్సారమైందో, అర్థవిహీనమైందో తన తాత, మేనమామల లాటి వాళ్ల జీవితాలే, వాళ్ల జీవన విధానాలే సాక్షి అని అర్థమైంది. ఆ ఒరిస్సా కళాకారులందరూ నిరక్షరాస్యులే! అయినా వాళ్లు మట్టితో సౌందర్యాన్ని సృష్టించడంలో ఎంతటి ప్రతిభావంతులు! తనకి ఆ కళాకారులతో పోయి శిల్పాలు చెయ్యడం నేర్చుకోవాలని మనసు ఉరకలు వేసింది. కానీ అమ్మకిచ్చిన మాట, తాత చేతిలోని పలుపుతాడు గుర్తొచ్చి కాళ్లకి బ్రేకులు పడ్డాయి. సౌందర్యానికీ, సృజనాత్మకమైన సృష్టికీ అవకాశం లేని, అవి నిషేధించబడ్డ కులంలో పుట్టినందుకు మొదటిసారిగా చింతించాడు.

మానవ జీవితానికి ఏ వస్తువులూ, పరికరాలూ లేకపోతే రోజు గడవదో అటువంటి వస్తు సామాగ్రిని కండలు కరిగించి, చెమట, నెత్తురోడ్చి, తరతరాలుగా పోగుచేసుకున్న నైపుణ్యాన్ని వెచ్చించి తయారుచేసే వారిని అభినందించడం, గౌరవించడంపోయి, అటువంటి శ్రమజీవుల్ని, నిపుణులైన సృజనాత్మకమైన కళాకారుల్ని- పనికొచ్చే దేనినీ సృష్టించడం చాతకాని తన తాత, మామ, సాంబడు లాటివాళ్లు సాంఘికపరంగా తక్కువగా, హీనంగా, నీచంగా, అంటరానివారుగా పరిగణించడం అసహజంగానూ, అన్యాయంగానూ, రోత పుట్టించేదిగాను అనిపించింది. మనిషి పుట్టుక అతని చేతుల్లో లేని విషయం. మనిషి దేశకాలానుబద్ధుడు. ఏదో ఒక కాలంలో, ఏదో ఒక దేశంలో తన ఇచ్ఛతో నిమిత్తం లేకుండా పుడతాడు. ఓ కులంలో పుట్టడం ఎలా గొప్ప విషయమో, మరో కులంలో పుట్టడం నీచమెలా అయిందో, ఈ తిరకాసు అర్థమేమిటో, దాన్నెవరు వివరించి చెప్పగలరో తనకు తెలియదు.

"ఎక్కువ తక్కువ కులాల్ని ఆ పరమాత్ముడే సృష్టించాడండీ బాబూ. పుణ్యం చేసుకుంటే బ్రాహ్మణ జన్మ లభ్యమవుతుందనీ, పాపకార్యాలు చేస్తే నీచ యోనుల్లోనూ జన్మిస్తారని స్వయంగా ఆ గీతాచార్యుడే చెప్పాడు గదండి. చేసుకున్నవాళ్లకి చేసుకున్నంత మహదేవ అనే మాట విన్లేదటండీ?..." అంటూ ఓ సారి తన తాత ఎవరికో తత్వబోధ చేయడం విన్నాడు.

అది వింటే తనకి నవ్వొచ్చింది. కడుపులో తిప్పినట్టయింది. శ్రమజీవనం చేస్తూ సమాజం కోసం సంపదని ఉత్పత్తి చేసేవాళ్లు పాపకార్యాలు చేసేవాళ్లూ, ఏ శ్రమా, ఏ ఉత్పత్తీ చేయనివాళ్లు, ఉత్పత్తి ప్రక్రియలకు దూరంగా వుంటూనే ఆ ఉత్పత్తిని అనుభవించేవాళ్లు పుణ్యాత్ములూనా? ఎక్కువ తక్కువల్ని, తారతమ్యాలని తనే సృష్టించానని చెప్పేవాడు దేవుడా? దేవుళ్లక్కూడా తక్కువ బుద్ధులుంటాయి కాబోలనిపించింది.

స్కూల్లో చదివేటప్పుడు ప్రతిరోజు గ్రౌండ్‌లో ప్రార్థన సమయంలో పిల్లల చేత- 'ఈ దేశం నా జన్మభూమి. ఈ గొప్పదేశంలో పుట్టడం నాకు గర్వకారణం...' అంటూ ప్రతిజ్ఞ చెప్పించేవారు.

మనుషుల గుణాల్నిబట్టీ, తెలివితేటలు, శక్తి సామర్థ్యాలు, వ్యక్తిత్వ విశేషాలను బట్టీ కాక, పుట్టిన కులాన్ని బట్టి గౌరవించడం కానీ, అగౌరవించడం కానీ చేసే దేశంలో పుట్టడం ఏరకంగా గర్వకారణమవుతుందో తనకి బోధపడేది కాదు. తన చిన్న సందేహాలని తీర్చలేని గురువులన్నా, పెద్దలన్నా తన మనసులో ఏమూలో అసహ్యం పేరుకుంది.

గోదావరి నదిపై కట్టిన బ్రిడ్జి నిర్మాణంలో ప్రమాదవశాత్తు ఎంతోమంది కూలీలు దుర్మరణం పాలయ్యారు. ఎంతోమంది వికలాంగులయ్యారు. ఆ బ్రిడ్జి ప్రారంభో

త్సవం చూడటానికి తనూ వెళ్లాడు. ఆ మహానిర్మాణ కార్యక్రమంతో ఏమాత్రం సంబంధంలేని మహా నాయకుల పేర్లు పాలరాతి శిలాఫలకాలపై చోటుచేసుకున్నాయి. ప్రారంభోత్సవ మంత్రాలు చదివిన సిద్ధాంతి, తన తాతగారిలాటి వాళ్లకి మిఠాయిలు, పట్టుపంచెలు, సంభావనలూ దక్కాయి. ఆ మహా నిర్మాణానికి నిర్మాతలైన కూలీలకి కన్నీళ్లు దక్కాయి.

ఎక్కడో మరో దేశంలోని మనిషి చంద్రమండలం మీద అడుగుపెట్టాడని పేపర్లో చూశాడు. "ఆ, ఇదో గొప్పేవిటండీ? ఈ రాకెట్లని తలదన్నే విమానాలు మన పురాణాల్లో ఎన్ని లేవు? కుబేరుడి పుష్పక విమానం గురించి మీరు విన్లేదా? దాన్నికన్నా గొప్పవటండీ ఈ పిల్ల రాకెట్లు?'' అంటూ దట్టంగా ముక్కుపొడుం పీలుస్తూ మునసబుతో చెప్తున్న మేనమామని చూసి తన మనసు సిగ్గుతో కుంచించుకుపోయింది.

ఒక్క వడ్లగింజని కూడా సృష్టించడం చెయ్యని వాళ్లు విమానాల గురించీ, రాకెట్ల గురించీ విమర్శించడం!

ఏ రకమైన శ్రమ, సృజనాత్మక కార్యకలాపాలకీ చోటులేని కులంలో పుట్టిన తనకి ఈ భిన్న ఆలోచనా ప్రవాహాలెలా వచ్చాయో తనకి తెలిసేదికాదు. ఏమైతేనేం, తాత మేనమామల కర్కశ నిరంకుశ పాదాల కింద తన జీవితం బియ్యం, కొబ్బరిచిప్పలు, చిల్లరడబ్బులు ఏరుకునే బ్రతుకైపోయింది.

తనకి రెండు పదులు నిండేసరికి, స్వతంత్రంగా పౌరోహిత్యం నిర్వహించే స్థాయి వచ్చేసరికి తనకి మేనమామ కూతురు సుబ్బుల్ని కట్టబెట్టేరు. సుబ్బులు నచ్చలేదని చెప్పే ధైర్యం తనకి లేదు. సుబ్బులు అందంగా వుండదు. లుబ్ధావధానుల్లాగ సంసార్లకి సౌందర్యంతో పనేమిటనే రకం తన తాత. కానీ ప్రతిచోట సౌందర్యాన్ని వెదికే తన కళ్లకి- కమ్మరి కొలిమిపాకలో గాలి తిత్తులూదే పదిహేనేళ్ల కమ్మరి కూతురు గ్రానైటు శిల్పంలాటి నునుపుతో, రామప్పదేవాలయంలోని నాగినిలా, సౌందర్యానికి నిర్వచనంలా కనిపించి తన మనసు పారేసుకున్నాడు. సమ్మెట ఎత్తి, కాల్చిన ఇనుముని బాదుతూ, ముసలి భీముడు వేసిన ఏదో జోకుకి ఆ పిల్ల విరగబడి నవ్వుతుంటే- ఆ నవ్వు అడవి నెమలి కేంకారంలా తన గుండెని చుట్టేసింది. మనసులేని తన దేహం నిరాసక్తంగా సుబ్బులిపరమైంది. సుబ్బుల్ని దగ్గరికి తీసుకున్నపుడు తన ఊహల్లో వున్నది గ్రానైటు సుందరే.

నదీ ప్రవాహాల్ని సైతం అదుపులో పెట్టగలిగే మనిషి అదుపులో పెట్టలేనిది కాలప్రవాహాన్నే. తన ఊరు కాస్తా పెద్ద బిజినెస్ సెంటరై, ఆఫీసులు, కాలేజీలు, వ్యాపారాలు పెరగడం వీరిగాడికి మంచి మలుపు నిచ్చింది. చెట్టుకింద చెప్పులు కుట్టడం మానేసి సెంటర్లో జోళ్ల బడ్డీ పెట్టాడు. కొత్త డిజైన్లతో, ఫాషన్లతో జనాలకి కావలసిన విధంగా, ఆకర్షణీయంగా పాదరక్షలు చేయ గలిగే అతని నైపుణ్యం, శ్రమ వట్టిపోలేదు. బడ్డీ పోయి చిన్న షాపు వెలసింది. ఆ చిన్న షాపు కూడా దినదిన ప్రవర్ధమానమై చివరికి మహావీర్ షూస్ షాపుగా నెంబర్ వన్ షాపయ్యింది. చింతచెట్టు క్రింద వీరిగాడు వీరయ్యగా పెద్ద ప్రొప్రయిటర్ వీరయ్యగా ఎదగడం మూడున్నర దశాబ్దాల కాలంలో తన కళ్లెదుటే జరిగింది. సృజనాత్మకత, శ్రమ జంటగా కాపురం చేస్తే ఫలితం ఎలా వుంటుందో తెలుసుకోడానికి వీరయ్య జీవితమే మంచి ఉదాహరణ అనిపించింది.

తన జీవితంలో మాత్రం ఏ మార్పూ లేదు. అదే గావంచా పంచె, అదే పాత సైకిలు, అవే సంచులు. అవే మంత్రాలు. కానీ తన సాటివాళ్లు మాత్రం కాలాను గుణ్యంగా చాలా మారారు. లూనాల మీద, స్కూటర్ల మీద ఎక్కి, కళ్లకి చలవ కళ్లద్దాలు, చేతికి ఇంపోర్టెడ్ రిస్టువాచీలు తగిలించి, ప్రొద్దుటే హోటళ్లల్లో సుష్టుగా లాగించి, తర్వాతే, తీరుబడిగా తద్దినం భోక్తలుగా వెళ్లి యూనియన్ రేట్ల ప్రకారం సంభావనలు వసూలు చేస్తున్నారు. వ్రతమంత్రాల కేసెట్ల దగ్గర్నుండీ తద్దినం మంత్రాల కేసెట్ల వరకూ అభివృద్ధి కన్పిస్తూనే వుంది.

తన కొడుకుని మాత్రం ఈ రొంపిలోకి దింపలేదు. "కులవృత్తిని కాలదన్నుకున్నందుకు అడుక్కు తినవలసిందేరా అప్రాచ్యపు వెధవల్లారా!...'' అంటూ పక్షవాతంతో మంచానపడ్డ తాత అరుస్తూ, శపిస్తూనే వున్నాడు. ఆయన చేతులు స్వాధీనం తప్పాయి కానీ, లేకపోతే తనని పలుపుతాడుతో బాది పౌరోహిత్యంలోకి దింపినట్టే, తన కొడుకునీ దింపేవాడేమో.

ఉత్తర దక్షిణాలు తోడులేని ఫస్టక్లాస్ డిగ్రీ నాలుగ్గీసుకోడానికి కూడా పనికిరాదని తెలుసుకున్నాక, ఓరోజు శాస్త్రి తను మహావీర్ షాపులో సేల్స్‌మన్‌గా చేరాలని చెప్పినపుడు, ఆ మాట తాత చెవిన పడకుండా తను జాగ్రత్తపడ్డాడు. వైదిక కుటుంబంలో పుట్టిన తన ముని మనవడు మాదిగ వీరయ్య చెప్పుల షాపులో అందరి కాళ్లు పట్టుకుని చెప్పులు తొడిగే ఉద్యోగం చేస్తున్నాడనే విషయాన్ని ఆ ముసలి సనాతన ఛాదస్తపు ప్రాణం జీర్ణించుకోలేదని తనకి తెలుసు. కానీ ఆ విషయం తనకి మాత్రం సంతోషాన్నే కలగజేసింది. ఏమీ శ్రమించ

కుండా, సమాజపు మూఢ నమ్మకాలనీ, మౌఢ్యాలనీ రెచ్చగొట్టి సొమ్ము చేసుకుని బ్రతికే తమలా కాకుండా, శ్రమమీద గౌరవం, అంకితభావం గల వీరయ్య దగ్గర ఒద్దికగా ఆత్మగౌరవంతో ఉద్యోగం చేస్తున్న కొడుకుని చూసి గర్వించాడు. తమ చేత స్పృశించబడటానికి కూడా అర్హత లేదని హీనంగా ఈసడించుకోబడ్డ వీరయ్య ఇపుడు పట్టభద్రుడైన తన కొడుక్కి యజమాని! వీరయ్యకి సాంఘికపరంగా జరిగిన అవమానానికి ఇది చెల్లుచీటి అనిపించింది. అపుడపుడు సాయంకాలాలు అలా బజారుకి వీరయ్యషాపు దగ్గరికి వెళ్లి కొడుకు బిజీగా శ్రమించడం చూసి సంతృప్తి చెందుతాడు. ఆ పని తనే చేస్తున్నట్టు భావించుకుంటాడు.

ఆలోచనల నుండి తేరుకుని ఇంటికి చేరేసరికి గుమిగూడి ఉన్న జనాన్ని చూసి జరిగింది అర్థమైంది.

ముసలాయన ద్వాదశ కార్యక్రమం ముగిసి ఎక్కడివాళ్లక్కడికి చేరుకున్నారు. ఎప్పటిలాగే ప్రొద్దుటే సాంబడి కొడుకు లూనా మీద వచ్చాడు. వాడు తన అసిస్టెంటు. ఆరోజు తమ ట్రూపులో ఎవరెవరు తద్దినాలు పెట్టించడానికి వెళ్లాలో, ఎవరెవరు ఎక్కడెక్కడికి గృహప్రవేశాలు, వ్రతాలు చేయించడానికి వెళ్లాలో ఏకరువు పెట్టాడు. రెడ్డిగారి లాడ్జి ప్రారంభోత్సవానికి తను వెళ్లాల్సి వుందని గుర్తుచేసి బియ్యం, కొబ్బరి చిప్పల సంచులు తన సైకిల్‌కి తగిలించాడు. సుబ్బులు కాఫీగ్లాసుతో వచ్చింది. భరద్వాజ జంధ్యం తీసి చిలక్కొయ్యకి తగిలించి చొక్కా వేసుకుని, చెప్పులు తొడుక్కుని బయటకు నడిచాడు. సుబ్బులు విస్తుపోతూ చూసి ఎక్కడికని అడిగింది. భరద్వాజ సమాధానమివ్వకుండా వీధిలోకి నడిచాడు.

రాత్రంత బిజినెస్ చేసి, బారెడు ప్రొద్దెక్కి లేచి, బద్ధకంగా ఆవులిస్తూ వళ్లు విరుచుకుంటున్న వేశ్యలా వుంది అపుడపుడే తెరుచుకుంటున్న బజారు. ఎప్పుడూ నెమ్మదిగా ఆవులిస్తూ సైకిల్ తొక్కే భరద్వాజ కాళ్లు చాలా చురుగ్గా అడుగులు వేస్తున్నాయి. కమ్మరి కొలిమి దగ్గర ఆగాయి భరద్వాజ కాళ్లు. తల వంచకపోతే, తలకి తగిలే పాక కాస్తా ఇప్పుడు పెద్ద ఎత్తయిన రేకుల షెడ్డయింది. ఎవరో దృఢమైన యువకుడు సమ్మెట పైకెత్తి ఎర్రగా కాలిన గునపం అంచుమీద కొడుతున్నాడు. సమ్మెట దెబ్బ పడినపుడల్లా ఖణేల్, ఖణేల్ మని శబ్దంతో రేకుల షెడ్ ప్రతిధ్వనిస్తోంది. అలా చూస్తోంటే ఒక్కసారి భరద్వాజ గుండె లయ తప్పింది. తోలుతిత్తుల స్థానంలో వున్న గాలిమర తిప్పుతోంది. పదిహేనేళ్ల పిల్ల. నేరేడు పండు రంగు పరికిణీ కచ్చాపోసి కట్టి, పోతపోసిన కంచు విగ్రహంలా వుంది. ఆ యువకుడేమన్నాడోగానీ, పకాపకా నవ్వుతోంది అడవి నెమళ్లు అరచినట్టు! తన గ్రానైట్ సుందరి కూతురు కాబోలు! ఆ పిల్లవంకే కళ్లార్పకుండా పది నిమిషాలు అలాగే చూసి, కదిలి, చురుగ్గా నడవసాగాడు.

సినిమా హాళ్లు, కూరల మార్కెట్ దాటి కుండలు పేర్చివున్న సందులోంచి విశాలంగా వున్న చోటికి వచ్చాడు. ఒకప్పుడు ఆ కుమ్మరి భూషయ్య వుండే చోటుని ఇప్పుడు షాపులు ఆక్రమించడంతో ఊరి చివరకు మారాడు. ఇపుడు ఆ ఊరి చివరి ప్రాంతం కూడా బిజీ ప్రాంతం అయిపోయింది.

''ఏం పంతులుగారూ! మీరు పనిగట్టుకు రావాలా? కబురుచేస్తే కావలసిన కుండలు తీసుకుని నేనే వద్దును గదా,'' బిజీగా వున్న భూషయ్య కొడుకు శివయ్య చెప్పాడు పనిచేస్తూనే. మట్టి ముద్దలు పేర్చి వున్నాయి అతనికి కొంచెం దూరంగా.

భరద్వాజ మాట్లాడలేదు.

కుమ్మరి చక్రం మీద డాన్స్ చేస్తూ ఆకారం సంతరించుకుంటున్న మట్టిముద్ద మీదున్నాయి అతని చూపులు.

మధ్యమధ్యలో నీళ్లతో చేతులు తడిచేసుకుంటూ, కూజా అంచులకి ఆకారం తీసుకొస్తున్నాడు, శివయ్య తన వేళ్లని తమాషాగా సుతారంగా కదిలిస్తూ.

జవాబు రాకపోవడంతో తలెత్తి చూశాడు శివయ్య.

భరద్వాజ చేతుల్లో అపురూపంగా, శిశువుని పట్టుకున్నంత జాగ్రత్తగా పట్టుకున్న మట్టిముద్ద వుంది.

మృదువైన, మెత్తటి ఆ మట్టిస్పర్శ- చంటి బిడ్డకి తల్లి రొమ్ము స్పర్శలా, ప్రియుడికి ప్రియురాలి స్తన స్పర్శలా అనిర్వచనీయంగా వుంది.

''నాకు కుండలు చెయ్యడం నేర్పుతావా శివయ్యా?'' అడిగాడు భరద్వాజ.

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 12 జూలై 1996